క్లుప్తంగా

చదువుతో పాటు క్రమశిక్షణ అవసరం


విద్యార్థులతో కర్నూలు గ్రూప్ కమాండర్ అలోక్ త్రిపాఠి

బేతంచెర్ల: విద్యార్థులు చిన్నప్పటి నుంచి చదువుతోపాటు దేశభక్తి, క్రమశిక్షణ అలవర్చుకోవాలని కర్నూలు గ్రూప్ కమాండర్, కల్నల్ అలోక్ త్రిపాఠి, ఆంధ్ర గర్ల్స్ బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్, కల్నల్ బోబి పిలిప్ అన్నారు. గురువారం మండల పరిధిలోని ఆర్ఎస్ రంగాపురం జెడ్పీ హైస్కూలును వారు సందర్శించారు. హెచ్ఎం శేషాచలం, ఎన్‌సీసీ ఆఫీసర్ శ్రీదేవి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో విద్యార్థులకు ఎన్‌సీసీ ప్రాముఖ్యత, క్రమశిక్షణ తదితర అంశాలపై అవగాహన కల్పించారు.

ఈ-క్రాప్ తప్పనిసరి

బేతంచెర్ల: ఖరీఫ్‌లో పంటలు సాగు చేసిన మండల రైతులు తప్పనిసరిగా ఈ-క్రాప్ నమోదు చేసుకోవాలని ఏఓ విజయ కుమార్‌రెడ్డి గురువారం తెలిపారు. ఈ సీజన్‌లో సాగు 27,500 ఎకరాలు కాగా ఇప్పటి వరకు 12,776 ఎకరాల్లో ఈ-క్రాప్ నమోదు పూర్తయిందన్నారు. ఈనెలాఖరు వరకు నమోదుకు అవకాశం ఉందన్నారు. రైతులు ఆయా రైతు సేవా కేంద్రాల వద్ద పంట వివరాలు నమోదు చేయించుకోవాలని తెలిపారు. పంట నమోదు వల్ల వ్యవసాయ శాఖ ద్వారా వచ్చే పథకాలకు అర్హత లభిస్తుందన్నారు.

దసరా సెలవులు మార్చాలి

కోవెలకుంట్ల: ఈ ఏడాది దసరా పండుగను పురస్కరించుకుని పాఠశాలలకు ప్రకటించిన సెలవు తేదీలను మార్పు చేయాలని రాష్ట్ర జాతీయ ఉపాధ్యాయ పరిషత్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎస్ఎం షరీఫ్, అధికార ప్రతినిధి ముత్తోజీ వీరబ్రహ్మం అన్నారు. గురువారం వారు విలేకరులతో మాట్లాడుతూ.. అకడమిక్ క్యాలెండర్ ప్రకారం ఈ నెల 24వ తేదీ నుంచి వచ్చే నెల 2వ తేదీ వరకు సెలవులు ప్రకటించారన్నారు. ఏటా మహాలయ అమావాస్య నుంచి విజయదశమి సెలవులు ప్రకటించడం ఆనవాయితీగా వస్తోందన్నారు. ఈ నెల 21వ తేదీ మహాలయ అమావాస్యను దృష్టిలో ఉంచుకుని అదే రోజు నుంచి అక్టోబర్ 3వ తేదీ వరకు సెలవులు ఇవ్వాలని డిమాండ్ చేశారు. తెలంగాణలో ఈ నెల 21వ తేదీ నుంచి వచ్చే నెల 3వ తేదీ వరకు సెలవులు ప్రకటించిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు.

వైద్య శిబిరానికి స్పందన


శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు సుబ్రమణ్యం

కోవెలకుంట్ల: పట్టణంలోని వాసవీ కన్యకా పరమేశ్వరీదేవి ఆలయ ఆవరణలో గురువారం ఏర్పాటు చేసిన ఉచిత ఆక్యుపంచర్, మ్యాగ్నెట్ థెరపీ వైద్య శిబిరం విజయవంతమైంది. ఈ శిబిరాన్ని ఆ సంఘం అధ్యక్షుడు పెండేకంటి సుబ్రమణ్యం ప్రారంభించారు. అధిక బరువు, రక్తపోటు, మోకాళ్లనొప్పి, మధుమేహం, ఆసిడి టీ, ఆస్తమా, థైరాయిడ్, మెడ, కీళ్ల నొప్పులు, బ్రాంకైటిస్, నిద్రలేమి, చికున్‌గున్యా, తదితర జబ్బులకు సంబంధించి రాజస్థాన్‌కు చెందిన నలుగురు వైద్యనిపుణులు పరీక్షలు నిర్వహించారు. అనంతరం రోగులకు కావాల్సిన మందులను ఉచితంగా పంపిణీ చేశారు. ఆర్యవైశ్య సంఘం నాయకులు పెండేకంటి నాగరాజు, కాల్వ శివనాగయ్య, నందయ్య, వాసు, రామచంద్రుడు, లక్ష్మీనారాయణ, సనత్‌కుమార్, నాగేంద్ర పాల్గొన్నారు.

నేడు యూరియా పంపిణీ

బనగానపల్లె: మండలంలోని ఆర్ఎస్‌కేల ద్వారా శుక్రవారం యూరియా పంపిణీ చేయనున్నట్లు ఏఓ సుబ్బారెడ్డి తెలిపారు. పలుకూరు -1064, యనకండ్ల -532, రామతీర్థం -532, బీరవోలు -532 నందవరం- 532 బస్తాలు, టంగుటూరు, నందవరం సొసైటీ ద్వారా 532 బస్తాలు పంపిణీ చేస్తామన్నారు. అలాగే పట్టణంలోని ప్రైవేట్ డీలర్లకు 1210 బస్తాలను కేటాయించినట్లు పేర్కొన్నారు. రైతులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. కాగా బనగానపల్లెలో 33 మి.మీ వర్షపాతం నమోదైనట్లు తెలిపారు.

ఎల్లమ్మ ఆలయ హుండీ చోరీ

డోన్ టౌన్: మండలంలోని ఉడుములపాడు రేణుకా ఎల్లమ్మ దేవాలయంలో బుధవారం రాత్రి గుర్తు తెలియని దుండగులు చొరబడి హుండీని చోరీ చేసినట్లు గ్రామస్తులు తెలిపారు. గ్రామం మీదుగా వెళుతున్న జాతీయ రహదారి పక్కన ఉన్న ఈ దేవాలయం తలుపులను దుండగులు పగులగొట్టి లోనికి ప్రవేశించారు. హుండీని ఎత్తుకెళ్లారు. గురువారం ఉదయం గమనించిన భక్తులు విషయాన్ని గ్రామస్తులు, పోలీసుల దృష్టికి తీసుకెళ్లారు. పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

ఉపాధ్యాయుల నిరసన

బనగానపల్లె రూరల్: ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ మండలంలోని టంగుటూరు జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఏపీటీఎఫ్ నాయకులు గురువారం నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. సంఘం జిల్లా ఉపాధ్యక్షులు హరినాథ్‌గౌడ్ మాట్లాడుతూ.. ఉపాధ్యాయులకు సంబంధించిన నాలుగు డీఏలను విడుదల చేయాలని, ఐఆర్‌ను ప్రకటించాలని, హెల్త్‌కార్డు పరిమితి పెంపునకు అసెస్మెంట్ బుక్లెట్ విధానం రద్దు చేయాలని డిమాండ్ చేశారు.


కోవెలకుంట్ల: సంతమార్కెట్ సమీపంలో జలమయమైన కాలనీ


సొదరదిన్నెలో బెండపంటలో చేరిన వర్షపునీరు


అమడాలలో ఉధృతంగా ప్రవహిస్తున్న జుర్రేరువాగు


పేరుసోములలో భారీగా పారుతున్న వరదనీరు

భారీ వర్షం.. అతలాకుతలం

- డోన్, బనగానపల్లె నియోజకవర్గాల్లో కుండపోత వాన
- కొలిమిగుండ్లలో అత్యధికంగా 128.4 మి.మీ వర్షం
- లోతట్టు ప్రాంతాలు జలమయం
- స్తంభించిన రాకపోకలు
- చెరువులను తలపిస్తున్న పంట పొలాలు


సంజామల: నష్టపోయిన పంటను చూపుతున్న రైతులు


బనగానపల్లె తహసీల్దార్ కార్యాలయం ఎదుట నీరు


ఎం.గోవిందిన్నెలో ఎర్రవాగు

కోవెలకుంట్ల: అల్పపీడన ప్రభావంతో కోవెలకుంట్ల వ్యవసాయ సబ్ డివిజన్‌లో బుధవారం అర్ధరాత్రి నుంచి గురువారం ఉదయం వరకు కుండపోత వర్షం కురిసింది. సబ్ డివిజన్‌లోని కొలిమిగుండ్లలో అత్యధికంగా 128.4 మి.మీ, అవుకులో 67.2 మి.మీ, కోవెలకుంట్లలో 50 మి.మీ, ఉయ్యాలవాడలో 32.4 మి.మీ, దొర్నిపాడులో 19.2 మి.మీ, సంజామలలో 30 మి.మీ వర్షపాతం నమోదైనట్లు వ్యవసాయ అధికారులు తెలిపారు. భారీ వర్షంతో కోవెలకుంట్ల పట్టణంలోని లోతట్టు ప్రాంతాలు జలమయం అయ్యాయి. ఎస్ఎల్‌వీటీ థియేటర్ వెనుక భాగం, బీసీ బాలుర వసతిగృహం, సంతమార్కెట్, అయ్యప్పస్వామి దేవాలయ వీధి, ఇందిరమ్మ, జగనన్న కాలనీల్లో వర్షపు నీరు నిలిచిపోవడంతో ప్రజలు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. అర్ధరాత్రి నుంచి ఉదయం 10 గంటల వరకు ఎడతెరిపి లేని వర్షం కారణంగా పట్టణంలో జీవనం స్తంభించింది. జాగ్రత్త చర్యగా ప్రైవేట్ పాఠశాలలకు సెలవు ప్రకటించారు. వరి, మినుము, మొక్కజొన్న, మిరప తదితర పంటలు వర్షపు నీటిలో మునిగాయి. అమడాల రైల్వే వంతెన సమీపంలో లోలెవల్ కల్వర్ట్ వద్ద మిరప పంటలు నీటమునిగాయి.

బనగానపల్లెలో 30 మి.మీ వర్షం

బనగానపల్లె రూరల్: మండలంలో 30 మి.మీ వర్షపాతం నమోదైంది. పట్టణంలో ప్రభుత్వ కార్యాలయాల వద్ద నీరు నిల్వ చేరింది.

ఉప్పొంగిన వాగులు

కోవెలకుంట్ల-లింగాల రహదారిపై నల్లవాగు, చిన్న వంచెవాగు, ఎర్రవాగు వరద నీటితో ఉప్పొంగాయి. వల్లంపాడు, లింగాల గ్రామస్తుల రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. నదికి వరద ఉధృతి పెరగనున్న నేపథ్యంలో పరివాహక గ్రామాల ప్రజలకు అధికారులు హెచ్చరికలు జారీ చేశారు.

కొలిమిగుండ్లలో కుండపోత

కొలిమిగుండ్ల: మండలంలో జిల్లాలోనే అత్యధికంగా 128.4 మి.మీ వర్షపాతం నమోదైంది. గురువారం తెల్లవారుజామున 2 నుంచి ఉదయం 9 గంటల వరకు ఏకధాటిగా వర్షం కురిసింది. వాగులు ఉప్పొంగడంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. నెల్లూరు-ముంబై రహదారిపై వాహనాలు నిలిచిపోయాయి. నాలుగు గంటలపాటు ప్రయాణికులు ఇబ్బందులుపడ్డారు. వాగు ఉధృతి తగ్గేదాకా వాహనాలు వెళ్లకుండా సిబ్బందిని ఏర్పాటు చేశారు. కోర్నపల్లె, కనకాద్రిపల్లె, నాయినపల్లె తదితర గ్రామాల్లో వాగులు ఉప్పొంగి ప్రవహించాయి.బెలుం పురాతన సిద్ధరామేశ్వరస్వామి ఆలయం వద్ద ఉన్న బావిలోకి వర్షపునీరు భారీగా చే రాయి.పలు గ్రామాల్లో పంట పొలాలు నీటమునిగాయి.

సంజామలలో 30 మీ.మీ

సంజామల: మండలంలో గురువారం తెల్లవారుజాము నుంచి ఉదయం 8 గంటల వరకు వర్షం కురవడంతో 30 మి.మీ వర్షపాతం నమోదైంది. పేరుసోము గ్రామంలో వాగు ఉధృతంగా ప్రవహిస్తోంది. రామిరెడ్డి పల్లె, ఆకుమల్ల గ్రామాల్లో వరి, మినుము పంటలు నీటమునిగాయి. ముదిగేడు, పాలేరు వాగులు ఉప్పొంగాయి. మట్టిమిద్దెల్లో నివసించే ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ హెచ్చరించారు.

బేతంచెర్ల: మండలంలో ఉదయం 6 నుంచి 10 గంటల వరకు కురిసిన వర్షం వల్ల పట్టణ వీధులు జలమయమయ్యాయి.డ్రైనేజీ నీరు వీధుల్లోకి చేరాయి. పలు గ్రామాల్లో వాగులు, కుంటలు పొంగి పొర్లాయి.


కొలిమిగుండ్లలో ప్రవహిస్తున్న వాగు

అవుకులో 67.2 మి.మీ

అవుకు(కొలిమిగుండ్ల): మండలంలో 67.2 మి.మీ వర్షపాతం నమోదైంది. కునుకుంట-ఉప్పలపాడు గ్రామాల మధ్యనున్న వాగు ప్రవహించడంతో పలు గ్రామాల మధ్య రాకపోకలు బంద్ అయ్యాయి. 3 గంటల తర్వాత ఉధృతి తగ్గడంతో రాకపోకలు సాగాయి. అవుకు రిజర్వాయర్‌కు 5300 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రావడంతో నీటిమట్టం 3.14 టీఎంసీలకు చేరింది. ప్రస్తుతం 3000 క్యూసెక్కుల అవుట్‌ఫ్లో కొనసాగుతోంది.


ఆకుమల్లలో నీట మునిగిన మినుము పంట


బేతంచెర్ల: గొరిపేటలో నిలిచిన వర్షపు నీరు


కొలిమిగుండ్ల: ప్రధాన రహదారిలో నిలిచిన వర్షపునీరు


కోర్నపల్లె వద్ద ప్రవహిస్తున్న వాగు

ఒకే రోజు ఆరు ఇళ్లలో చోరీ

- 15 తులాల బంగారం, రూ.1.92 లక్షల నగదు అపహరణ
- హెచ్ కొట్టాలలో రెచ్చిపోయిన ముసుగు దొంగలు


రవి శంకర్ ఇంట్లో దుండగులు ధ్వంసం చేసిన బీరువాలు, చిందరవందరగా పడేసిన వస్తువులు

బేతంచెర్ల: మండలంలోని హెచ్.కొట్టాల గ్రామంలో ఎప్పుడూ లేని విధంగా ఒకే రాత్రి ఆరు ఇళ్లలో చోరీలు జరిగాయి. దీంతో గ్రామంలో భయాందోళన వాతావరణం నెలకొంది. బుధవారం రాత్రి గుర్తు తెలియని దొంగలు బోయపాటి రవిశంకర్, ఉన్నం ధనుంజయ, యండూరి తిరుపాలు, యండూరి మోహన్ రావు, చికెన్ బాషా, మంజుల అరుణ ఇళ్లలో తాళాలు పగుల గొట్టి బంగారం, వెండి, నగదు, మొబైల్ ఫోన్లు దోచుకెళ్లారు. రవిశంకర్ ఇంటి నుంచి 12 తులాల బంగారం, 10 తులాల వెండి, రూ.20 వేల నగదు అపహరించారు. లారీ డ్రైవర్ ధనుంజయ ఇంట్లో రూ.72 వేల నగదు, యండూరి తిరుపాలు ఇంట్లో మూడు సెల్‌ఫోన్లు, మంజుల అరుణ ఇంట్లో 3 తులాల బంగారం, 16 తులాల వెండి, రూ.1 లక్ష నగదు చోరీ చేశారు. చికెన్ బాషా ఇంట్లో రూ. 500 నగదు చోరీ చేశారు. యండూరి మోహన్ రావు ఇంటి తాళాలు పగులగొట్టి ఏమీ దొరకకపోవడంతో వెళ్లిపోయారు. ఒక ఇంట్లో మాత్రం మనుషులు ఉండడంతో చోరీ విఫలమైంది. ఆ ఇంట్లోని సీసీ కెమెరాల్లో ముసుగు ధరించిన నలుగురు వ్యక్తులు కనిపించారు. అయితే మొత్తం ఆరు ఇళ్లలో చోరీలు నలుగురే చేశారా లేక మరికొందరా అన్నది పోలీసుల దర్యాప్తులో తేలాల్సి ఉంది. గ్రామంలో ఒకేసారి ఆరు ఇళ్లలో దొంగతనాలు జరగడంతో గ్రామస్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి

బనగానపల్లె రూరల్: ట్రాక్టర్ ఢీకొని గాయపడిన స్కూటరిస్టు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం మృతిచెందాడు. ఎస్ఐ వెంకటసుబ్బయ్య వివరాల మేరకు.. నందివర్గం పోలీస్‌స్టేషన్ పరిధిలోని జిల్లెల్ల గ్రామానికి చెందిన మేకల సుబ్బారాయుడు(56) బుధవారం గౌండ పని నిమిత్తం గోనవరం గ్రామానికి వెళ్లి పని ముగించుకుని సాయంత్రం ద్విచక్రవాహనంపై స్వగ్రామం బయల్దేరాడు. మార్గమధ్యలో బనగానపల్లె వైపు నుంచి వస్తున్న ట్రాక్టర్ ఢీకొనడంతో తీవ్రంగా గాయపడ్డాడు. నంద్యాల శాంతిరామ్ వైద్యశాలలో చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందినట్లు ఎస్ఐ వెల్లడించారు. మృతుడి కుమారుడు విజయకుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

మధ్యాహ్న భోజనం తనిఖీ


మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న ఏపీస్టేట్ ఫుడ్ కమిషన్ మెంబర్ దేవి

కోవెలకుంట్ల: పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాలలో అమలు చేస్తున్న మధ్యాహ్న భోజన పథకాన్ని గురువారం ఏపీ స్టేట్ ఫుడ్ కమిషన్ మెంబర్ దేవి తనిఖీ చేశారు. విద్యార్థినులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందిస్తున్నారా అనే విషయాన్ని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పలు విషయాలను డోన్ డిప్యూటీ డీఈఓ వెంకట్రామిరెడ్డిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం పాఠశాలను సందర్శించి వివిధ సమస్యలపై హెచ్ఎం అరుణకుమారితో చర్చించారు. అలాగే రేవనూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. పీహెచ్‌సీ పరిధిలో రక్తహీనతతో బాధపడుతున్న గర్భిణుల వివరాలను డాక్టర్ మహబూబ్ సుభానిని అడిగి తెలుసుకున్నారు. హైరిస్క్ గర్భిణుల వివరాలు, ప్రసవాలకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. ఎఫ్‌డీపీ నోడల్ ఆఫీసర్ డాక్టర్ జయచంద్ర, డాక్టర్ దివ్య, సీడీపీఓ ఉమామహేశ్వరి, సీహెచ్ఓ లక్ష్మిదేవి, ఎంఈఓ వెంకట సుబ్బయ్య, హెల్త్ సూపర్‌వైజర్లు ప్రభావతి, మునిస్వామి ఉన్నారు.

జలపాతం పరవళ్లు


ఉధృతంగా ప్రవహిస్తున్న ఎత్తిపోతల జలపాతం

అవుకు(కొలిమిగుండ్ల): భారీ వర్షానికి ఎర్రమల కొండల్లో నుంచి వాగులన్నీ ఏకం కావడంతో ఎత్తిపోతల జలపాతానికి భారీగా నీళ్లు చేరాయి. గురువారం అవుకు మండలంలోని కొండమీద గ్రామాల్లో కురిసిన వర్షానికి ఎత్తిపోతల జలపాతం జలకళ సంతరించుకుంది. ప్యాపిలి మండలం బూరుగుల, అవుకు మండలం మారేమడుగుల, ఉప్పలపాడు తదితర గ్రామాల నుంచి వాగులు, వంకలు ఏకం కావడంతో జలపాతానికి భారీగా నీళ్లు వచ్చి చేరాయి. రిజర్వాయర్‌లోకి పెద్ద మొత్తంలో జలపాతం నీళ్లు చేరుతున్నాయి. ఎత్తిపోతల జలపాతం దృశ్యాలు చూపరులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి.

ఉపాధ్యాయుడికి సన్మానం


శివనాగేశ్వరరావును సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

బనగానపల్లె రూరల్: స్థానిక జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో భౌతికశాస్త్ర ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తూ ఇటీవల జిల్లా ఉత్తమ ఉపాధ్యాయుడి అవార్డు పొందిన శివనాగేశ్వరరావును పీఆర్‌టీయూ మండలశాఖ ఆధ్వర్యంలో గురువారం సన్మానించారు.పలువురు పీఆర్‌టీయూ ఉపాధ్యాయ సంఘం నాయకులు మాట్లాడుతూ.. శివనాగేశ్వరావు విధులపై అంకితభావంతో పనిచేసేవారని.. ఆయనకు అవార్డు దక్కడం హర్షణీయమన్నారు. కార్యక్రమంలో అవుకు ఎంఈఓ శ్రీధర్‌రావు, హెచ్ఎంలు సోమశేఖర్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, ఉపాధ్యాయులు దస్తగిరి, ముకుందారెడ్డి, శ్రీనివాసరెడ్డి, బాలమద్దిలేటి పాల్గొన్నారు.

వ్యాపారికి బెదిరింపులు.. ముగ్గురి అరెస్ట్



నిందితులను అరెస్టు చూపుతున్న సీఐ

డోన్ టౌన్: పట్టణంలో పండ్ల వ్యాపారిని బెదిరించి కాటా (వేయింగ్ మిషన్) తీసుకెళ్లిన ముగ్గురు నిందితులను పోలీసులు అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. గురువారం స్థానిక సీఐ కార్యాలయంలో జరిగిన పాత్రికేయుల సమావేశంలో సీఐ ఇంతియాజ్ బాషా ఈ విషయాన్ని వెల్లడించారు. అనంతపురం జిల్లా గుత్తికి చెందిన సయ్యద్ నూర్ బాషా డోన్‌లో పండ్ల వ్యాపారం చేస్తుండగా పాతపేటకు చెందిన గొల్ల రఘు అలియాస్ జామకాయల రవి, ఉప్పరి సురేంద్ర, చిగురమానుపేటకు చెందిన అబ్బాస్ అతనిని బెదిరించారు. వ్యాపారం చేయాలంటే తమ అనుమతి తప్పనిసరి అని హెచ్చరించినట్లు బాధితుడు ఫిర్యాదు చేశాడు. దీనిపై కేసు నమోదు చేసి ముగ్గురిని గురువారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామని సీఐ తెలిపారు. ఎస్ఐ శరత్‌కుమార్‌రెడ్డి, ఏఎస్ఐ భాస్కర్ పాల్గొన్నారు.

దౌర్జన్యాలపై కఠిన చర్యలు

పట్టణంలో ఎవరు దౌర్జన్యాలకు పాల్పడినా, వ్యాపారులను భయభ్రాంతులకు గురి చేసినా కఠిన చర్యలు తప్పవని సీఐ ఇంతియాజ్ బాషా హెచ్చరించారు. ఇలాంటి సంఘటనలు ఎదురైనప్పుడు ప్రజలు భయపడకుండా వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని కోరారు.

విరిగిపడిన కొండ చరియలు


మద్దిలేటిస్వామి ఆలయం వద్ద విరిగిపడిన కొండ చరియలు

బేతంచెర్ల: మండల పరిధిలోని మద్దిలేటి లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో గురువారం కురిసిన భారీ వర్షానికి ఆలయ పక్కన కొండచరియలు విరిగి పడ్డాయి. ఆ సమయానికి భక్తులు ఎవరూ లేకపోవడంతో పెను ప్రమాదం తప్పింది. గతంలో ఆలయ నిర్మాణ పనుల కోసం కొండను తొలగించినప్పటికీ, పూర్తి స్థాయిలో తొలగించకపోవడంతో వర్షాకాలంలో అప్పుడప్పుడూ రాళ్లు కూలిపోతున్నాయని అధికారులు తెలిపారు. ఈ అంశాన్ని ఆలయ ఈఓ రామాంజనేయులు దృష్టికి తీసుకెళ్లగా, ఇంకా కొంత కొండ తొలగింపు అవసరం ఉందని.. ఇంజినీరింగ్ సిబ్బంది ఇప్పటికే ప్లాన్, ఎస్టిమేట్‌లు సిద్ధం చేసి సమర్పించారని తెలిపారు. దేవదాయశాఖ కమిషనర్ అనుమతి పొంది తగిన చర్యలు తీసుకుంటామన్నారు.

అమరవీరులకు నివాళి

డోన్ టౌన్: విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన అమరవీరులను ప్రతి ఒక్కరూ స్మరించుకోవాల్సిన అవసరం ఉందని జిల్లా అటవీశాఖ అధికారిణి నాగమనేశ్వరి, డోన్ ఫారెస్టు రేంజర్ ప్రవీణ్‌కుమార్, డీఆర్ఓ రవీంద్రనాయక్ అన్నారు. జాతీయ అటవీ అమరవీరుల దినోత్సవం సందర్భంగా యర్రగుంట్ల రహదారి సమీపంలోని నగరవనంలో అమరవీరులకు నివాళులర్పించారు. బనగానపల్లె, పాణ్యం డీఆర్వోలు, అటవీ సిబ్బంది పాల్గొన్నారు.

స్ఫూర్తి ప్రదాత.. వివేకానంద

డోన్ టౌన్ : స్వామి వివేకానంద ప్రపంచ దేశాలకే ఆదర్శంగా నిలిచారని వివేకానంద సేవా సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు జగన్మోహన్, అధ్యక్ష కార్యదర్శులు నాగభూషణం రెడ్డి, జొన్నలగడ్డ శ్రీనివాసులశెట్టి, సప్తశైల తిమ్మయ్య అన్నారు. చికాగో నగరంలో వివేకానందుడు ఇచ్చిన ప్రసంగ దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం కొత్త బస్టాండ్ సమీపంలోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. యువతకు స్వామి వివేకానంద స్ఫూర్తి ప్రదాత అన్నారు.

పశువులకు గర్భకోశ వ్యాధి నిర్ధారణ పరీక్షలు


పరీక్షలు చేస్తున్న పశువైద్య సిబ్బంది

డోన్: పాడి పశువుల సంఖ్య పెంపొందించేందుకు అమలు చేస్తున్న పెయ్యదూడల ఉత్పత్తి పథకంలో రైతులు భాగస్వాములు కావాలని కర్నూలు పశుసంవర్ధక శాఖ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ రాజశేఖర్ అన్నారు. డోన్ మండలం చిన్నమల్కాపురం గ్రామంలో గురువారం ఆ శాఖ సహాయ సంచాలకుడు నాగరాజు ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత పశుగర్భ కోశ వ్యాధుల చికిత్స శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. గొడ్డుమోతు పశువులు, ఎదకు రాని పశువులకు గర్భకోశ వ్యాధుల చికిత్స అవసరమన్నారు. పాడి పరిశ్రమ, గొర్రెల పెంపకం లాభసాటిగా ఉండాలంటే వాటికి వచ్చే సీజనల్ వ్యాధులపై పెంపకందారులకు అవగాహన అవసరమని పేర్కొన్నారు.

పెయ్యదూడల ఉత్పత్తి లాభదాయకం

పెయ్యదూడల ఉత్పత్తి పాడిరైతులకు లాభసాటిగా ఉంటుందని రాజశేఖర్ అన్నారు. ప్రభుత్వం సబ్సిడీపై కృత్రిమ గర్భాధారణ పరీక్షలు చేయడంతో పాటు ఇంజక్షన్లు ఇస్తున్నందు వల్ల పశుపోషకులు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. అనంతరం 75 శాతం సబ్సిడీతో మేలైన పశుగ్రాస విత్తనాలను పశుపోషకులకు అందజేశారు.

రణభేరిని జయప్రదం చేద్దాం


కరపత్రాలను విడుదల చేస్తున్న యూటీఎఫ్ నాయకులు

ప్యాపిలి: ఈ నెల 15 నుంచి 19 వరకు నిర్వహించనున్న యూటీఎఫ్ రణభేరి బైక్‌జాతాను జయప్రదం చేయాలని ఆ యూనియన్ నాయకుడు అబ్దుల్ లతీఫ్ కోరారు. ఈ మేరకు గురువారం కరపత్రాలను విడుదల చేశారు. పెండింగ్‌లో ఉన్న నా లుగు డీఏలను ప్రభుత్వం తక్షణమే చెల్లించాలని.. 12వ పీఆర్సీని ప్రకటించాలని డిమాండ్ చేశారు. అంత వరకు 29 శాతం మధ్యంతర భృతి ఇవ్వాలన్నారు. ఈ నెల 15న కర్నూలులో ప్రారంభమ య్యే బైక్ జాతా ఉమ్మడి అనంతపురం, కడప జిల్లా ల మీదుగా తిరిగి డోన్‌కు చేరడంతో ముగుస్తుందన్నారు. రాష్ట్రంలోని మొత్తం ఐదు ప్రాంతాల్లో సాగే బైక్ జాతా ఈ నెల 19న ముగుస్తుందన్నారు. ఈ నెల 25న విజయవాడలో రణభేరి బహిరంగ సభ నిర్వహిస్తామన్నారు. యూటీఎఫ్ నాయకులు గో పాల్, సర్వజ్ఞమూర్తి, మోహన్‌రెడ్డి, చార్లెస్, రమేష్, సంధ్యారాణి, రుక్మిణి, రోహిణి పాల్గొన్నారు.